

రుణమాఫీ గజిబిజి

రూ.లక్ష రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



నిర్లక్ష్యమే కాటేసింది

పాముకాటుకు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. 8లో▸



పడకేసిన పారిశుద్ధ్యం..

తాండూరు మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉండగా, 14,500 వరకు ఆవాస గృహాలు ఉన్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

నేడు మంత్రుల రాక

తాండూరు: రాష్ట్ర మంత్రులు టీ.హరీష్‌రావు, పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం తాండూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారని బీఆర్‌ఎస్ నేతలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, విలియంమూన్ స్కూల్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో వారు పాల్గొంటారని తెలిపారు. అలాగే తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో జరిగే మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరవుతారు.

ఇంటర్ అడ్మిషన్లు షురూ

బషీరాబాద్: బషీరాబాద్ మండలానికి ఈ మధ్యే మంజూరైన ఇంటర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభించినట్లు జిల్లా ఇంటర్‌మీడియట్ నోడల్ అధికారి శంకర్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో అడ్మిషన్ కోసం బుధవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

35 మందికి కంటి ఆపరేషన్లు

కొడంగల్: కొడంగల్ ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆప్తాల్మిక్ అసిస్టెంట్ హరినాథ్ నెహ్రూ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. తీవ్ర కంటి సమస్యలు ఉన్న 35 మందిని గుర్తించి ఆపరేషన్ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మురహరి వశిష్ట, జయతీర్థాచారీ, శ్రీనివాస్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, డాక్టర్ సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం




నియామకపత్రం అందుకుంటున్న లక్ష్మీనారాయణగౌడ్

అనంతగిరి: గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా వికారాబాద్ మండలం గోధుమగూడకి చెందిన గౌండ్ల లక్ష్మీనారాయణగౌడ్ నియామకమయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావుగౌడ్ చేతులమీదుగా మంగళవారం నియామకపత్రం అందుకున్నారు. లక్ష్మీనారాయణగౌడ్ మాట్లాడుతూ..గ్రామ కమిటీలు వేసి సంఘం అభ్యున్నతికి పాటుపడతానని తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన సంఘం నేతలకు . ఈసందర్భంగా ఆయన దన్యవాదాలు తెలిపారు.

హామీలను విస్మరించిన సర్కార్

డీసీసీ అధ్యక్షుడు టీఆర్ఆర్



ఆశవర్కర్లతో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ఆశ వర్కర్లను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సమస్యలు పరిష్కరించాలని పరిగి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట సమ్మె నిర్వహిస్తున్న ఆశవర్కర్లకు మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. స్వరాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులకు నిరాశే మిగిలిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత తదితర అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధిచెప్పాలన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, కౌన్సిలర్ శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయ సాధనకు కృషి

ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి సూచించారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పరిగిలో ఐలమ్మ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ అశోక్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, రజకసంఘం జిల్లా అధ్యక్షుడు రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

పర్సెంటేజీ ఇవ్వాల్సిందే



వికారాబాద్ ట్రెజరీ కార్యాలయం

- ట్రెజరీ కార్యాలయాల్లో కొనసాగుతున్న లంచాల పర్వం!
- జీపీ, ఎమ్మెల్యే నిధులు, ఉద్యోగుల బిల్లుల వరకు ఇదే తంతు
- ఒక శాతం నుంచి 8శాతం వరకు ముట్టజెప్తేనే బిల్లులు క్లియర్
- లేదంటే నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్న అధికారులు
- చేసేదిలేక అడిగినంత ఇస్తున్న బాధితులు

వికారాబాద్: ట్రెజరీ (ఎస్టీఓ, డీటీఓ) కార్యాలయాల్లో పర్సెంటేజీల పర్వం జోరుగా సాగుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని నాలుగు ఎస్టీఓ కార్యాలయాతో పాటు డీటీఓ కార్యాలయంలో చేయి తడపనిదే ఏ పనీ అవ్వట్లేదని బాధితులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ, ఎమ్మెల్యే నిధుల బిల్లులు మొదలుకుని ఉద్యోగుల బిల్లుల వరకు.. ట్రెజరీల్లో ఏ పనులు కావాలన్న ఒక్కోపనికి ఒక్కో పర్సెంటేజీ ఇచ్చుకోవాల్సిందే. ఆయా పనులకు, నిధులకు సంబంధించిన బిల్లులను బట్టి ఒక శాతం మొదలుకుని 8 శాతం వరకు ట్రెజరీల్లో పర్సెంటేజీలు ఇవ్వనిదే బిల్లులు క్లియర్ చేయడం లేదని బాధితులు వాపోతున్నారు. అడిగినంత పర్సెంటేజీ ఇవ్వకుంటే బిల్లుల కోసం నెలల తరబడి వేచిచూడక తప్పటంలేదని సర్పంచులు,కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. ఆలస్యం అయితే బయట తెచ్చిన డబ్బులకు వడ్డీల మీద వడ్డీలు కట్టాల్సి వస్తుండటంతో.. అధికారులు అడిగిన మేరకు పర్సెంటేజీలు ఇచ్చి బిల్లులు క్లియర్ చేపించుకుంటున్నామని బాధితులు వాపోతున్నారు. ఎవరైనా ధైర్యం చేసి మీడియా వాళ్లకు చెప్పినా లేక ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా.. సదరు వ్యక్తుల బిల్లులు పూర్తిగా ఆపేస్తున్నారని సమాచారం. గట్టిగా మాట్లాడితే మీ ఇష్టమొచ్చిన చోటు చెప్పుకోండి అని దబాయిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని బిల్లులదీ అదే పరిస్థితి

ఉద్యోగుల వేతనాలు మినహా మిగతా అన్నిరకాల బిల్లులు క్లియర్ చేసేందుకు పర్సెంటేజీలు తప్పనిసరిగా ఇవ్వాలంటూ ట్రెజరీ అధికారులు కరాఖండిగా చెప్తున్నట్లు సమాచారం. 15వ ఫైనాన్స్ నిధులు నేరుగా జీపీ ఖాతాల్లో జమ అవుతుండటంతో వాటి విషయంలో అధికారుల జోక్యం ఉండటం లేదు. ఇవి మినహా జీపీలలో ఎస్ఎఫ్‌సీ, సీడీపీ (నియోజకవర్గ అభివృద్ధి నిధులు), ఎస్‌డీఎఫ్ నిధులు, పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి తదితర అన్నిరకాల నిధులకు సంబంధించిన బిల్లులకు పర్సెంటేజీలు ఇచ్చుకోవాల్సి వస్తోందని సర్పంచ్‌లు వాపోతున్నారు.

ఉద్యోగులకు సైతం..

ఇదే సమయంలో ఉద్యోగులకు సంబంధించి మెడికల్ బిల్లులు, డీఏ, పీఆర్సీ ఏరియర్స్, జీపీఎఫ్, ఫెస్టివల్ అడ్వాన్స్‌లు, రిటైర్‌మెంట్ సమయంలో వచ్చే డబ్బులు, ఈఎల్స్‌తో పాటు అత్యవసర బిల్లులు... ఇలా ఏ బిల్లు అయినా సరే పర్సెంటేజీలు ఇవ్వనిదే పనికావడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ట్రెజరీ డిపార్ట్‌మెంట్లలోని కిందిస్థాయి అధికారుల నుంచి మొదలుకుని జిల్లాస్థాయి అధికారుల వరకు ఈ పర్సెంటేజీల పరంపర కొనసాగుతోందని సమాచారం. ఈ విషయమై గతంలో జెడ్పీ అధికారులు, ట్రెజరీ అధికారుల మధ్య పెద్ద వివాదమే నడిచింది. ఇటీవల కలెక్టరేట్‌లో విధులు నిర్వహించే ఓ అధికారి జీపీఎఫ్ లోన్ కోసం దరఖాస్తు చేసుకోగా 8 శాతం ఇస్తేనే బిల్లులు త్వరగా వస్తాయని తెలపినట్లు సమాచారం.

నాలుగు శాతం ఇస్తేనే బిల్లు క్లియర్..

క్లియర్ చేయాల్సిన బిల్లులో నాలుగు శాతం పర్సెంటేజీ ఇస్తే పది రోజుల్లోపు బిల్లులు చెల్లిస్తున్నారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. హైదరాబాద్‌లోని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే (తాండూరుకు చెందిన) ఓ వ్యక్తి ద్వారా లావాదేవీలు జరుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాము అడిగిన ఆ నాలుగు శాతం డబ్బులు ముందే ఇస్తే అత్యవసర బిల్లుల పేరుతో వారం పది రోజుల్లో బిల్లులు అందేలా చూస్తున్నారని..లేదంటే బిల్లులకోసం నాలుగు నెలలు ఆగాల్సి వస్తుందని ఓ కాంట్రాక్టర్ వాపోయాడు. మీడియాలో కథనాలు వచ్చిన సమయంలో మొత్తానికే బిల్లులు ఆపేస్తున్నారంటూ కాంట్రాక్టర్లు, ఉద్యోగులు వాపోతున్నారు. రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి సారించి జిల్లాలోని ట్రెజరీ కార్యాలయాల్లో జరుగుతున్నఅక్రమాలను అరికట్టాలని బాధితులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

బిల్లుల కోసం జిల్లా పరిధిలోని కార్యాలయాల్లో డబ్బులు తీసుకుంటున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్‌లోని ఫైనాన్స్ కార్యాలయంలో తీసుకునే డబ్బుల గురించి మాకు సంబంధం లేదు. బిల్లులు అధికంగా ఉండటం వల్ల క్లియర్ చేయటంతో కొంత ఆలస్యం అవుతున్న మాట వాస్తవమే.

– వెంకటరమణ, డీటీఓ, వికారాబాద్

'ఐలమ్మ'ను స్ఫూర్తిగా తీసుకోవాలి



వికారాబాద్ అర్బన్: ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, నాయకులు

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి కొనియాడారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వెట్టిచాకిరీ విముక్తి, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఐలమ్మ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కులవృత్తులను నిర్వహించుకుంటూ అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని కలెక్టర్ కోరారు. సబ్బండవర్గాల అభివృద్ధి కోసం ఐలమ్మ కృషి అభినందనీయమని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఎంపీపీ చంద్రకళ, డీబీసీడీఓ ఉపేందర్, డీవైఎస్ఓ హన్మంతరావు, డీటీడబ్ల్యూఓ కోటాజీ, జిల్లా రజకసంఘం అధ్యక్షుడు రాములు, సంఘం నాయకులు రత్నారెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మకు నివాళి

అనంతగిరి: తెలంగాణ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసరావు, ఏఓ జ్యోతిర్మయి, సీఐలు..రాజు, వెంకటేశం, ప్రమీల, రవి, శ్రీను, ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భాగవత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న భజన మండలి సభ్యులు

మర్పల్లి: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని బూచన్‌పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో చేపట్టిన భజనలు మంగళవారం ముగిశాయి. 41 రోజుల పాటు నిత్యం రాత్రి రాత్రి 8 నుంచి తెల్లవారు జాము 3 గంటల వరకు భగవద్గీత పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గీతలోని 18 అధ్యాయాల్లోని శ్లోకాలు, భావాల పఠనం తమకెంతో ఆనందాన్నిచ్చాయని భక్తులు తెలిపారు. పవిత్రమైన శ్రావణమాసంలో ఆధ్యాత్మిక భావాలతో గడపడం చెప్పలేని అనుభూతిని ఇచ్చిందన్నారు. ప్రతిఒక్కరూ దైవనామ స్మరణ చేయాలని సూచించారు. యువత చేడు వ్యసనాలను వీడి నిత్యం కొంత సమయం దేవాలయాల్లో గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో భజన మండలి భక్తులతో పాటు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. హనుమాన్ మందిరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు. గీతాపారాయణంలో తరించిన 18 మంది భజన మండలి సభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.



మొక్కనాటి నీరు పోస్తున్న డీజీ జితేందర్, సిబ్బంది

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జైళ్లశాఖ డీజీ, ప్రిన్సిపాల్ సెక్రటరీ జితేందర్

అనంతగిరి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జైళ్లశాఖ డీజీ, ప్రిన్సిపాల్ సెక్రటరీ జితేందర్ అన్నారు. తెలంగాణకు హరితహారంలో భాగంగా తెలంగాణ జైళ్లశాఖ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జైళ్లకు సంబంధించిన ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం వికారాబాద్ సమీపంలోని జైళ్లశాఖ ఖాళీ స్థలంలో జైళ్లశాఖ డీజీ, ప్రిన్సిపాల్ సెక్రటరీ జితేందర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. డీజీ మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలని అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ జైళ్లశాఖ తరపున హరితహారం కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐజీలు రాజేష్, మురళి బాబు, డీఐజీలు శ్రీనివాస్, సంపత్, వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి, చర్లపల్లి, చంచల్‌గూడ, ఓపెన్ జైల్ చర్లపల్లి ఎస్పీలు సంతోష్ రాయ్, శివకుమార్ గౌడ్, కళాసాగర్, జైళ్ల శాఖ హైదరాబాద్ రేంజ్ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన హైదరాబాద్ రేంజ్ డీఐజీ శ్రీనివాస్, సబ్ జైళ్ల అధికారి రామచంద్రం, పరిగి సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌ను డీజీ జితేందర్ ప్రత్యేకంగా అభినందించారు.

బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలం

- ఎమ్మెల్యేలు ఆనంద్, నరేందర్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు



వికారాబాద్ అర్బన్: ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ మండలం గోధుమగూడకి చెందిన పలువురు నాయకులు మంగళవారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలం అన్నారు. పార్టీలో చేరిన నాయకులకు భవిష్యత్‌లో అండగా ఉంటామన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలన్నారు. పార్టీలో చేరినవారిలో నర్సింహారెడ్డి,వెంకట్,శ్రీనివాస్, రాజు, తదితరులు ఉన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకం..

కొడంగల్: నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌కు చెందిన బీజేపీ నాయకుడు చంద్రప్ప మంగళవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 8 మండలాలనుంచి వివిధ పార్టీల నుంచి అధిక సంఖ్యలో నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు చెప్పారు. పార్టీలో చేరిన వారికి భవిష్యత్‌లో తగిన స్థానం కల్పిస్తామన్నారు. బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్‌రావ్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, ఏఎమ్‌సీ డైరెక్టర్ అరుణ్, అన్నుబాయి, దత్తురెడ్డి, యాదగిరి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

కొడంగల్ పట్టణానికి చెందిన పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్ మాతృమూర్తి సోమవారం చనిపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సోమవారం రాత్రి యూసూఫ్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి యూసూఫ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు

రాష్ట్రంలో పచ్చదనం భేష్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

- హరితహారం సత్ఫలితాలనిస్తోంది
- సీఎస్ శాంతికుమారి
- దక్కన్ ఉడ్స్ అండ్ ట్రయల్స్ వర్క్‌షాప్ ప్రారంభం

మొయినాబాద్ రూరల్: హరితహారంలో భాగంగా గడిచిన ఐదేళ్లలో తెలంగాణలో సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు 300 కోట్ల మొక్కలు నాటించారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ సమీపంలోని మృగవని రెస్టారెంట్‌లో నిర్వహించిన దక్కన్ ఉడ్స్ అండ్ ట్రయల్స్ వర్క్‌షాప్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఫారెస్ట్‌ఉన్నతాధికారులకు రెండు రోజుల పాటు పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అడవులు 7.7 శాతం పెరిగాయన్నారు. దీంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయన్నారు. కేరళ, రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా తదితర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో పచ్చదనం బాగుందని తెలిపారు. జాతీయ స్థాయిలో వచ్చిన అవార్డులే తెలంగాణ ప్రగతికి సాక్ష్యాలని స్పష్టంచేశారు. ఎకో టూరిజం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. టీఎస్‌ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ సాధనకు సీఎం కేసీఆర్ నిర్విరామంగా పని చేస్తున్నారన్నారు. అన్ని జిల్లాల్లో ఎకో టూరిజం ప్రారంభించాలని భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం టూరిజం కార్పొరేషన్ ఆధ్వర్యంలో సీఎస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్‌ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, కన్జర్వర్ ఫారెస్ట్ హోప్ దూబేరియల్‌అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెన్నా ఫ్యాక్టరీలో ప్రమాదం

డింపర్ ఆపరేటర్‌కు గాయాలు



మైనింగ్ జోన్‌లో బోల్తాపడిన లారీ

తాండూరు రూరల్: మండల పరిధిలోని బెల్కటూర్ శివారులో ఉన్న పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీలో మంగళవారం ప్రమాదం చోటు చేసుకుంది. కార్మికుల తెలిపిన కథనం ప్రకారం.. తాండూరు మండలం చంద్రవంచ గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ ఫ్యాక్టరీలోని మైనింగ్ డిపార్ట్‌మెంట్‌లో డింపర్(లారీ) ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం విజయ్‌కుమార్ డింపర్ నడుపుతుండగా బ్రేక్ పడకపోవడంతో గుంతలో పడిపోయింది. ప్రమాదంలో విజయ్‌కుమార్ రెండు కాళ్లు విరిగిపోయాయి. వెంటనే తాండూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించారు. కంపెనీలోని మైనింగ్ హెచ్ఓడీ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని కార్మికులు ఆరోపిస్తున్నారు. వాహనాలు కండిషన్లో లేకపోయినప్పటికీ నడపమంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయ్‌కుమార్‌కు కంపెనీ యాజమాన్యమే మెరుగైన వైద్యం అందిచాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

నేడు మంత్రి హరీశ్ పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు టౌన్: రూ.50 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన, ప్రారంభించనున్నారని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తెలిపారు. మంత్రి పర్యటన నేపథ్యంలో మంగళవారం నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ స్థలం, మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలోని దుకాణ సముదాయాలను ఎమ్మెల్యే పరిశీలించారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్న స్థానిక విలియంమూన్ మైదానంలో ఏర్పాట్లను ఎమ్మెల్యే పర్యవేక్షించారు. పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను డీఎస్పీ శేఖర్ గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను మంత్రి ప్రారంభించనున్నారని చెప్పారు. అనంతరం బహిరంగ సభ, వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

డీసీఎంను ఓవర్‌టెక్ చేయబోయి..

లారి కింద పడి ఇద్దరు మృతి

పూడూరు: డీసీఎంను ఓవర్‌టెక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీ కింద పడి ఇద్దరు మృతి చెందిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మన్నేగుడ నుంచి హైదరాబాద్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు, పోలీస్‌స్టేషన్ సమీపంలో డీసీఎంను ఓవర్‌టెక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ క్రమంలో వారు లారీ టైర్ల కిందపడి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో మగ, ఆడ ఉన్నారు. మృతదేహాలను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచామని చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

మేకల వ్యాపారికి రిమాండ్



పోలీసుల అదుపులో నిందితుడు పాండు

తాండూరు రూరల్: గొర్రెలు, మేకలను కొనుగోలు చేసి కాపరులకు డబ్బులు ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతున్న మేకల వ్యాపారిని కరన్‌కోట్ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపి వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం గోట్లపల్లి గ్రామానికి చెందిన పాండు మేకల వ్యాపారి.. తాండూరు, పెద్దేముల్, బషీరాబాద్, బొంరాస్‌పేట్ మండల పరిధి గ్రామాల గొర్రెల కాపరుల వద్ద జీవాలను కొనుగోలు చేస్తుంటాడు. ఈ క్రమంలో కాపరులకు ఇవ్వాల్సిన డబ్బు రూ.9 లక్షల 50 వేలు ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. కొన్ని నెలల క్రితం చెంగోల్ గ్రామానికి చెందిన కాపరులు కొందరు కరన్‌కోట్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మంగళవారం పాండును అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం

శంకర్‌పల్లి: సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యా దయ్య అన్నారు. మంగళవారం జనవాడ, మిర్జాగూడ, ఇంద్రారెడ్డి నగర్, మహారాజ్‌పేట్, గోపులారం గ్రామాల్లో అండర్‌డ్రైనేజీ, సీసీ రోడ్లకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రతీ గ్రామానికి మౌ లిక వసతులు కల్పించడంతో పాటు సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ ఏర్పాటునకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. ఇందులో శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

రుణమాఫీ గజిబిజి

- సమాధానం దొరకని ప్రశ్నలతో అన్నదాతల ఉక్కిరిబిక్కిరి
- గడువు ముంచుకొస్తున్నా.. గోడువినని వ్యవసాయాధికారులు
- సరైన సమాచారం లేక.. బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- సగం మందికే మాఫీ అయిందంటున్న కర్షకులు



డీసీసీబీ బ్యాంకు

మోమిన్‌పేట: రూ.లక్ష రుణమాఫీ గందరగోళంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒకరికి మాఫీ కావడం, మరొకరి కాకపోవడంతో బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 2020 సంవత్సరం.. రూ.25వేల నుంచి రూ.50వేల వరకు కొంతమంది రైతులకు 2022 వరకు రుణమాఫీ అయింది. 2023 ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ నెలాఖరులోగా మాఫీ పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గడువు ముగిసేందుకు మరో రెండు రోజుల సమయమే ఉంది. కానీ ఇప్పటి వరకు చాలా మందికి మాఫీ కాలేదు. దీంతో కొందరు రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం మాఫీ చేస్తుందా.. లేక చేతులు దులుపుకొంటుందా అని విమర్శించారు.

సమాచారం ఇచ్చేవారు లేక..

2018 డిసెంబరు 11నాటికి ఉన్న రుణాలను రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. రూ.25 వేలు ఉన్న రైతులకు ఇప్పటికీ మాఫీ కాలేదు. కానీ రూ.లక్ష రుణం ఉన్న రైతులకు మాఫీ అయింది. ఇది ఎలా సాధ్యమని, అంతా గజిబిజిగా ఉందని కర్షకులు వాపోతున్నారు. ఏ ప్రణాళికతో ప్రభుత్వం మాఫీ చేస్తోందనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై వ్యవసాయ అధికారులను సంప్రదించగా.. 2018 డిసెంబరు11 వరకు రుణాలు తీసుకున్న రైతులు మాఫీకి అర్హులని చెప్పారని, బ్యాంకర్లను అడిగితే అంతా పై నుంచే, మాకు ఎలాంటి సంబంధం లేదని చెప్పినట్లు తెలుస్తోంది. ఇలా సంబంధిత అధికారులను రుణమాఫీ గురించి అడగగా సరైన సమాచారం లేక పోవడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.



యూనియన్ బ్యాంకులో ఫీల్డ్ అధికారి వద్ద రైతులు

అరకొరే మాఫీ

మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో అర్హత కలిగిన పంట రుణాల ఖాతాలు 3,235 ఉన్నాయి. అందులో ఇప్పటి వరకు 1,200 ఖాతాలకు మాత్రమే మాఫీ అయింది. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో 1,952 ఖాతాలు ఉండగా.. 800 లకు మాఫీ జరిగింది. పీఏసీఎస్ మోమిన్‌పేటలో 1,373 పంట రుణ ఖాతాలకు రూ.4.02 కోట్లు రుణమాఫీ కావాల్సి ఉండగా.. 911 ఖాతాలకు రూ.2.54కోట్లు మాత్రమే మాఫీ అయింది. పీఏసీఎస్ మేకవనంపల్లిలో 1,082 ఖాతాలకు రూ.5.14 కోట్లు మాఫీ కావాల్సి ఉండగా.. 780ఖాతాలకు గాను రూ.3.61కోట్లు మాఫీ వచ్చింది. దీంతో ప్రభుత్వం చెప్పిన గడువు మరో రెండు రోజుల్లో ముగియనుండగా.. పూర్తిగా మాఫీ జరుగుతుందో లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు రుణమాఫీ ప్రణాళికపై రైతులకు ఉన్న సందేహాన్ని తీర్చాలని వారు కోరుతున్నారు.

“ పూర్తి వడ్డీ చెల్లిస్తున్నా..



యూనియన్ బ్యాంకులో 2016లో రూ.86వేల పంటరుణం తీసుకున్న. యేటా రెన్యూవల్ చేయిస్తున్న. రైతులకు ఇస్తున్నామంటున్న పావలా వడ్డీ రావడం లేదు. పూర్తి వడ్డీ చెల్లిస్తున్నా. రుణమాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగాను. సరైన సమాధానం రావటం లేదు. నా తోటి రైతుల్లో కొంత మందికి రూ.లక్ష మాఫీ వచ్చింది. ఇదెలా సాధ్యం. అంతా అయోమయంగా ఉంది.

– నజీర్ అహ్మద్, రైతు, ఎన్కేపల్లి

మనుగడ లేని ఖాతాలను సరిచేస్తున్నాం



కొన్ని ఖాతాలు మనుగడలో లేకపోవడంతో మాఫీ డబ్బులు ప్రభుత్వానికి తిరిగి వెళ్తున్నాయి. అలాంటి ఖాతాలకు వారి వారసుల ఆధార్ కార్డులను జత చేసి బ్యాంకర్లకు అందజేస్తున్నాం. ప్రభుత్వం విడతల వారీగా మాఫీ నిధులు బ్యాంకులకు నేరుగా పంపిస్తోంది. ఒకరికి మాఫీ కావడం, మరొకరికి కాకపోవడం సందేహంగానే ఉంది.

–జయశంకర్, వ్యవసాయ అధికారి, మోమిన్‌పేట

నిర్లక్ష్యమే కాటేసింది!



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బీసీసంఘం నాయకులు, మృతుడి కుటుంబీకులు

పాముకాటుతో వ్యక్తి మృతి
సరైన చికిత్స అందలేదంటూ
బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

తాండూరు టౌన్: జిల్లా ఆసుపత్రి వైద్యాధికారుల నిర్లక్ష్యంతో ఓ నిండు ప్రాణం బలైపోయింది. పాము కాటుకు గురైన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకురాగా.. మందు లేదని వైద్యుడు చెప్పడంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయిస్తుండగా.. పరిస్థితి చేయిదాటిపోయి మృత్యువాత పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు పట్టణం బెగ్గర్స్ కాలనీకి చెందిన బీసీ సంఘం సభ్యుడు మహ్మద్ మతిన్(43)కు సోమవారం అర్ధరాత్రి ఇంటి వద్ద పాము కరిచింది. వెంటనే కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించగా.. పాముకాటుకు మందు లేదని, పరిస్థితి విషమంగా ఉంది నగరానికి తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు చెప్పారు. దీంతో నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మతిన్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



మృతుడు మహ్మద్ మతిన్ (ఫైల్)

వైద్యం అందలేదని..

వైద్యం కోసం వచ్చిన వ్యక్తికి సరైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేసిన డాక్టర్ సంతోష్‌పై చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మృతుడి కుటుంబీకులతో కలిసి తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. ఘటనపై స్పందించని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మూర్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మృతుడి బంధువు అహ్మద్ పాష పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆందోళనలో బీసీ నాయకులు సయ్యద్ షకూర్, జ్యోతి, కౌన్సిలర్ ప్రభాకర్ ఉన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: మత్స్యకారుల సంక్షేమాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గుర్లకుంట చెరువు, గోవిందాయిపల్లి తండా కొత్తచెరువులో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తాలతో కలిసి చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కులవృత్తులతో ఉపాధి పొందుతున్న వారి ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి కడ్తాల్ మండలంలోని 42పైగా చెరువులు, కుంటల్లో 6 లక్షల 50 వేల చేప పిల్లలను పెంచేందుకు మత్స్యశాఖ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి డీసీఎం వాహనాలతో పాటు, టీవీఎస్ వాహనాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, వైస్‌ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ, యువజన సంఘాల అధ్యక్షుడు రాఘవేందర్, ముదిరాజ్ కులస్తులు, అధికారులు, నాయకులు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యరథంతో పేదలకు వైద్య సేవలు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ఆరోగ్యరథంతో వైద్యసేవలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని ఊరేళ్ల గ్రామంలో మంగళవారం ఆరోగ్యరథం వైద్యసేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు అందుబాటులో వైద్యసేవలు ఉన్నాయని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆరోగ్యరథంలో అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేస్తారని సూచించారు. ప్రతి పల్లెకు ఆరోగ్యరథం సేవలు అందిస్తోందని తెలిపారు. వైద్యపరీక్షలు చేసి ప్రతి ఒక్కరికి హెల్త్‌కార్డులు అందిస్తారని, దీంతో మీ ఆరోగ్యం మీ చేతులో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, సర్పంచ్ జహంగీర్, ఉప సర్పంచ్ విఠలయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభాకర్, శివకుమార్, చందు, వెంకటేశంగుప్తా, నరేందర్, రవికాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, గని, నాగార్జున్‌రెడ్డి, మల్లారెడ్డి, తెలుగు వెంకటేశ్, మహేశ్, చాన్ పాష, భ్రమరాంబ ఉన్నారు.

పింఛన్‌లు రావడం లేదంటూ ఆగ్రహం

ఊరేళ్లకు వచ్చిన ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎదుట పలువురు వృద్ధులు పింఛన్‌లు రావడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో నాయకుల వెంట తిరిగే వారికే అన్ని ఇస్తే.. పేదల పరిస్థితి ఏమి కావాలంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ 20రోజుల్లో దరఖాస్తులు చేసుకున్న అర్హులైన వారందరికీ పింఛన్‌లు వస్తాయని నచ్చజెప్పారు.



ఆరోగ్యరథం వైద్యసేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ తదితరులు

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి



మహేందర్ మృతదేహం

షాబాద్: విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చందనవెల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన చెవిటి మహేందర్(55) పెయింటింగ్ పని చేస్తూ జీవనం కొనసాగిస్తుండేవాడు. చందనవెళ్లి గ్రామానికి చెందిన చాకలి సత్తయ్య ఇంటి వద్ద మూడు రోజులుగా పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. రోజులాగే మంగళవారం పెయింటింగ్ వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఇనుపరాడ్ ఇంటి పైన ఉన్న విద్యుత్ వైర్లకు తగలడంతో మహేందర్‌కు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య, కుమారులు బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

- **ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

నందిగామ: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. చేగూరులో అమెజాన్ వెబ్ సర్వీసెస్(ఏడబ్ల్యూఎస్) ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన లైబ్రరీని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సర్పంచ్ సంతోష విఠల్ చేసిన కృషి ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. ఇక్కడ గ్రంథాలయం లేదని తెలుసుకున్న అమెజాన్ వారు స్వచ్ఛందగా ముందుకు వచ్చి ఏర్పాటు చేశారన్నారు. పుస్తక పఠనం ద్వారా ఎంతో జ్ఞానం పెంపొందుతుందన్నారు. ఇందులో జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్, సర్పంచ్ సంతోష, ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్ ఉన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బీజేపీ నేత కుమార్‌గౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: మండలం పరిధిలోని బాటసింగారంలోని లేఅవుట్‌లో ప్రజావసరాల కోసం వదిలిన సుమారు ఎకరం ఖాళీ స్థలాన్ని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ గీతా మోర్చా అబ్దుల్లాపూర్‌మెట్ మండల కో కన్వీనర్ గడ్డం కుమార్‌గౌడ్ మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 376/5,14,16,18,19,21ల్లోని స్థలంలో మైలారాంరెడ్డి అనే వ్యక్తి 25ఏళ్ల క్రితం లే అవుట్‌ను చేసి ప్లాట్లుగా విక్రయించడంతో పాటు సుమారు 1 ఎకరం స్థలాన్ని ప్రజావసరాల కోసం వదిలిపెట్టాడు. ఆ స్థలానికి కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలను సృష్టించి ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారంటూ పంచాయతీ కార్యదర్శికి, సబ్‌రిజిస్ట్రార్‌లకు ఫిర్యాదు చేసినట్లు కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. స్థలం ఆక్రమణకు గురికాకుండా పంచాయతీ బోర్డును ఏర్పాటు చేయాలని పాలకవర్గ సభ్యులు ఈనెల 15వ తేదీన తీర్మానం చేశారు. తీర్మానాన్ని పట్టించుకోకుండా సర్పంచ్ లతాశ్రీ, పంచాయతీ కార్యదర్శి ఆక్రమణదారులకు మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఆక్రమించుకున్న భూమికి ప్రహరీ నిర్మిస్తున్నా చర్యలు పంచాయతీ తరఫున ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు. కోట్ల రూపాయల విలువ చేసే భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడడంతో పాటు తప్పుడు పత్రాలను సృష్టించి ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

పెద్దఅంబర్‌పేట ఔటర్‌పై రోడ్డు ప్రమాదం



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జీవన్‌రెడ్డి

కంటైనర్‌ను ఢీకొన్న కారు.. యువకుడి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చెల్ జిల్లా మేడిపల్లి పీఅండ్‌టీ కాలనీకి చెందిన సింగిరెడ్డి జీవన్‌రెడ్డి (23) సోమవారం సాయంత్రం తన కారులో ఘట్‌కేసర్ నుంచి ఔటర్ మీదుగా చంద్రాయణగుట్టకు వెళ్లేందుకు వస్తుండగా మార్గమధ్యలోకి రానే తన కారుకు ముందుగా వెళ్తున్న ఓ కంటైనర్ డ్రైవర్ తన వాహనానికి ఎలాంటి సిగ్నల్స్ ఇవ్వకుండానే అకస్మాత్తుగా వేగాన్ని తగ్గించడంతో అదే వేగంతో వస్తున్న జీవన్‌రెడ్డి తన కారును కంటైనర్‌కు బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో జీవన్‌రెడ్డికి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో కారు కంటైనర్ కిందికి దూసుకుపోవడంతో నుజ్జునుజ్జయింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



మర్పల్లి: చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కొడంగల్‌లో రజక సంఘం నాయకులు

వీరనారి చాకలి ఐలమ్మ

‘వీరనారి చాకలి (చిట్యాల) ఐలమ్మ పోరాటం ఆదర్శనీయం. నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆమె ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం’ అని వక్తలు అన్నారు. ధీర వనిత ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లాలో అధికారికంగా సకల జనులు ఆమె చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె త్యాగాలను స్మరించుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



అనంతగిరి: ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి



దోమలో.. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులు



ధారూరులో.. సర్పంచ్ చంద్రమౌళి, రజక సంఘం నాయకులు